ఫోక్స్‌వ్యాగన్ టైగున్ ఆర్ మాడల్

ముంబై, ఏప్రిల్ 14: ఫోక్స్‌వ్యాగన్.. దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. స్పోర్ట్స్ ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో విడుదల చేసిన ఈ టైగున్ ఆర్-లైన్ మాడల్ కారు ధర రూ.49 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, త్రీ-జోన్ క్లైమెట్ కంట్రోల్, ఐడీఏ వాయిస్ అసిస్టెంట్, 15 అంగుళాల టచ్ స్క్రీన్ వంటి ఫీచర్స్‌తో తయారైన ఈ కారు పెట్రోల్, డీజిల్, హైబ్రిడ్ రకాల్లో లభించనున్నది. భద్రత ప్రమాణాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ కారులో తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ముందు-వెనుక డిస్క్ బ్రేకులు, లెవల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. కాగా, టారిఫ్ వార్ నేపథ్యంలో భారత్‌పై దృష్టిసారిస్తున్నామని సంస్థ చెప్తున్నది.

మందగించిన దేశ ఆర్థికం?

డీజిల్‌కు తగ్గిన డిమాండ్ • నాలుగేండ్ల కనిష్ఠానికి వినియోగపు వృద్ధి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశీయంగా డీజిల్‌కు డిమాండ్ పెద్దగా పెరిగిన దాఖలాలు లేవు. దేశ ఆర్థిక కార్యకలాపాల అంచనా సూచికల్లో ఒకటిగా ఉన్న డీజిల్ వినియోగం వృద్ధి.. ఏకంగా నాలుగేండ్ల కనిష్ఠానికి క్షీణించడం గమనార్హం. 2020-21 తర్వాత గడిచిన ఏడాది కాలమే డీజిల్ వినియోగం కేవలం 2 శాతం పెరిగి 91.4 మిలియన్ టన్నులకు పరిమితమైనట్టు కేంద్ర చమురు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ) తాజాగా తెలియజేసింది. ఇది 2023-24తో పోల్చితే 4.3 శాతం, 2022-23తో చూస్తే 12.1 శాతం తక్కువ కావడం మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నదిప్పుడు.

ఇదీ సంగతి..

దేశీయంగా చమురు వినియోగంలో డీజిల్ వాటా దాదాపు 40 శాతం. భారీ ట్రక్కులు, లారీలు.. పెద్ద పెద్ద యంత్రాలు నడిచేది ఇప్పటికీ డీజిల్‌తోనే. దీంతో డీజిల్ వినియోగంలో స్వల్ప పెరుగుదల.. దేశంలో దిగజారుతున్న తయారీ, పడిపోతున్న రవాణా కార్యకలాపాలకు నిదర్శనంగా నిలుస్తున్నదని మెజారిటీ మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిజానికి విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) వినియోగం భారత్‌లో ఏటేటా పెరుగుతూపోతున్నది. కానీ ఈవీలు ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, కార్ల విభాగానికే పరిమితమవుతున్నాయి. దీనికి తగ్గట్టు ఇప్పటికీ దేశంలో వస్తూత్పత్తులు, ఇతరత్రా రవాణాకు చిన్నవైనా.. పెద్దవైనా నాలుగింటా మూడొంతులు ఇంకా డీజిల్ ఆధారిత వాహనాలనే వాడుతున్నామని పరిశ్రమ వర్గాలు సైతం చెప్తున్నాయి. సాధారణంగా పెరుగుతున్న జనాభా, దానికి అనుగుణంగా విస్తరిస్తున్న మార్కెట్ అవసరాల దృష్ట్యా డీజిల్ వాడకం కూడా పెరగాలి. అయితే ఇందుకు భిన్నంగా వాస్తవ గణాంకాలుండటం.. దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనానికి సంకేతాలేనన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి.

తగ్గిన నాఫ్తా డిమాండ్

పరిశ్రమల్లో వాడే నాఫ్తా వినియోగం కూడా గత ఆర్థిక సంవత్సరం అంతకుముందుతో పోల్చితే 4.8 దిగజారి 13.15 మిలియన్ టన్నులుగానే ఉన్నట్టు తాజా గణాంకాల్లో తేలింది. ఫ్యూయెల్ ఆయిల్ వాడకం సైతం దాదాపు 1 శాతం క్షీణించి 6.45 మిలియన్ టన్నులుగానే ఉన్నది. అలాగే రోడ్ల నిర్మాణంలో వాడే బిటుమెన్ వినియోగం 5.4 శాతం తగ్గి 8.33 మిలియన్ టన్నులుగా ఉన్నది. అయితే గత ఆర్థిక సంవత్సరం దేశీయంగా పెట్రోల్ వాడకం 7.5 శాతం పెరిగి 40 మిలియన్ టన్నులను తాకింది. ఎల్‌పీజీ డిమాండ్ కూడా 5.6 శాతం ఎగిసి 31.32 మిలియన్ టన్నులకు చేరింది. విమానాల్లో జెట్ ఇంధన వాడకం 9 శాతం ఎగబాకి 9 మిలియన్ టన్నులుగా నమోదైంది. పెట్రోలియం కోక్ డిమాండ్ 8.6 శాతం పెరిగితే, లూబ్రికెంట్స్, గ్రీజులు 12.3 శాతం ఆదరణను చూశాయి. మొత్తంగా డీజిల్ దెబ్బకు గత ఆర్థిక సంవత్సరం చమురు వినియోగ వృద్ధి కరోనా విజృంభించిన 2019-20, 2020-21ని మినహాయిస్తే దశాబ్దం కనిష్ఠానికే పతనమైనట్టు చెప్పుకోవచ్చు..

రుణగ్రహీతలకు ఎస్బీఐ శుభవార్త

వడ్డీరేట్లను పావు శాతం తగ్గించిన బ్యాంక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. రిజర్వు బ్యాంక్ రెపో రేట్లను పావు శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎస్బీఐ కూడా రుణాలపై వడ్డీ రేటును అంతేస్థాయిలో కోత పెట్టింది. రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)ని 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రుణరేటు 8.25 శాతానికి దిగొచ్చింది. దీంతోపాటు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్)ని అంతే స్థాయిలో తగ్గించడంతో రేటు 8.65 శాతానికి దించింది. తగ్గించిన రేట్లు ఈ నెల 15 నుంచి అమలులోకి రానున్నట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇప్పటికే రుణాలు తీసుకున్నవారితో పాటు కొత్తగా రుణాలు తీసుకోనున్నవారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నాయి. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి రిజర్వుబ్యాంక్ ఈఏడాదిలో వరుసగా రెండోసారి వడ్డీరేటును పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా..

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా వడ్డీరేటును బ్యాంక్ 25 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా ఏడాది నుంచి రెండేండ్లలోపు డిపాజిట్లపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రేటు 6.8 శాతం నుంచి 6.7 శాతానికి దిగింది. రెండేండ్ల నుంచి మూడేండ్ల లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని కూడా 6.9 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉన్నది. మరోవైపు, 444 రోజుల కాలపరిమితితో కూడిన ప్రత్యేక డిపాజిట్ స్కీం అమృత్ వృష్టి స్కీంను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీంపై 7.05 శాతం వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

బీవోఎం సైతం..

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) కూడా కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించింది. రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)ని పావు శాతం తగ్గించడంతో రుణాలపై వడ్డీరేటు 9.05 శాతం నుంచి 8.80 శాతానికి దిగొచ్చింది. మరో ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా బెంచ్‌మార్క్ లెండింగ్ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్ఎల్ఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటు 9.10 శాతం నుంచి 8.85 శాతానికి దిగిరానున్నాయి.

ఖరీదైన పరిశ్రమల భూములు

- గరిష్ఠంగా 12 శాతం వరకు ల్యాండ్ రేట్లను పెంచిన టీజీఐఐసీ
- కర్ణాటకతో పోల్చుకుంటే భారీ వ్యత్యాసం
- కొత్త పరిశ్రమల రాక కష్టమేనంటున్న పారిశ్రామిక వర్గాలు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పారిశ్రామిక వాడల్లో భూముల ధరలు గరిష్ఠంగా 12 శాతం పెంచారు. వచ్చే ఏడాది మార్చి వరకు పెరిగిన రేట్లు అమల్లో ఉంటాయని టీజీఐఐసీ జూరీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్ సమీపంలోని పారిశ్రామిక వాడల్లో భూముల ధరలు అందుబాటులో లేవనే వాదనలు వినిపిస్తున్న తరుణంలో టీజీఐఐసీ మళ్లీ భూముల ధరలు పెంచడంపై పరిశ్రమ వర్గాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగంతోపాటు పారిశ్రామిక రంగం సైతం నేలచూపులు చూస్తున్న విషయం తెలిసిందే. తక్కువ ధరలకే భూములంటూ పొరుగు రాష్ట్రాల నుంచి వెల్లువెత్తుతున్న పోటీ ఒకవైపైతే.. సబ్సిడీలు రావడం లేదనే కారణం మరోవైపు. అన్నీ వెరసి రాష్ట్రంలో దాదాపు గత ఏడాదిన్నర కాలంగా పారిశ్రామిక రంగం స్తబ్ధుగా ఉన్నది. ఈ నేపథ్యంలో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయిస్తున్న భూముల ధరలను గణనీయంగా పెంచింది. సైబరాబాద్, శంషాబాద్, పటాన్‌చెరూ, యాదాద్రి, మేడ్చల్-సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర జోన్ల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్క్‌లలో 12 శాతం వరకూ ధరలు పెంచారు. దీంతో పారిశ్రామికాభివృద్ధిని అడ్డుకున్నట్టేనని ఇండస్ట్రీ వర్గాలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

బహిరంగ మార్కెట్‌లోనే చౌక

బహిరంగ మార్కెట్‌లోని వ్యవసాయ భూములతో పోల్చుకుంటే టీజీఐఐసీ పారిశ్రామిక వాడల్లో నిర్ణయించిన ధరలు ఎంతో ఎక్కువగా ఉండడం గమనార్హం. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలోని గద్వాలలో ఎకరం భూమి రూ.1.10 కోట్లు, ఆదిభట్లలో రూ.5 కోట్లు, సీతారాంపూర్, చందన్‌వల్లిలో రూ.3 కోట్లు, పటాన్‌చెరూలో రూ.6 కోట్లు, రామగుండంలో రూ.4.5 కోట్లు, నిజామాబాద్‌లో రూ.6.3 కోట్లుగా ధర నిర్ణయించారు. రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడంతో ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం భూములు కొనేవారే కరువయ్యారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌తో సంబంధం లేకుండా ధరలు నిర్ణయించడం సమంజసం కాదని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. కేవలం రోడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించి ధరలు అమాంతం పెంచితే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణలో టీజీఐఐసీ నిర్ణయించిన భూముల ధర (ఎకరం)లిలా..

హైటెక్ సిటీ మాదాపూర్ లేఔట్‌లో	రూ.65.27 కోట్లు
నానాక్‌రాం గూడ-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో	రూ.62.55 కోట్లు
గచ్చిబౌలీ ఇండస్ట్రియల్ పార్క్‌లో	రూ.62.55 కోట్లు
మణికొండ ఐటీ పార్క్‌లో	రూ.59.83 కోట్లు
చందూలాల్ బారాదరి ఇండస్ట్రియల్ పార్క్‌లో	రూ.20.46 కోట్లు
కాటేదాన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో	రూ.15 కోట్లు

పొరుగు రాష్ట్రాలతో పోటీ ఎలా...?

పెద్ద ఎత్తున పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తూ పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయితీలను ప్రకటిస్తున్నది. స్వరాష్ట్రానికి తరలిరావాలని అక్కడి సర్కారు కోరుతున్నది. అలాగే బెంగళూరులో సైతం పారిశ్రామిక వాడల్లో భూముల ధరలు హైదరాబాద్‌తో పోల్చుకుంటే ఎంతో తక్కువగా ఉన్నాయి. అయితే తెలంగాణ తరహాలోనే కర్ణాటకలో కూడా రాయితీలు సకాలంలో విడుదల చేయడం లేదని, అయినప్పటికీ భూముల ధరలు మన రాష్ట్రంతో పోల్చుకుంటే ఎంతో తక్కువగా ఉండడం వల్ల బెంగళూరు ప్రత్యామ్నాయంగా ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరోవైపు మన రాష్ట్రంలో భూ సేకరణకు అంతటా రైతులు తిరగపడుతుండడంతో రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయడం అత్యంత సంక్లిష్టంగా మారింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన పారిశ్రామిక వాడల్లోనే మిగిలిన ప్లాట్లను ప్రస్తుతం విక్రయిస్తున్నారు.

ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ) ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) తమ వార్షిక ఎక్సలెన్స్ అవార్డులు-2025 కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఫెడరేషన్ అధ్యక్షులు సురేశ్ కుమార్ సింఘాల్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతులు, ఏరోస్పేస్-డిఫెన్స్, టూరిజం తదితర మొత్తం 21 విభాగాల్లో నామినేషన్లు ఆహ్వానించినట్టు, వీటిలో అత్యుత్తమ ప్రతిభగల కంపెనీలు, వ్యక్తులను అవార్డుల కోసం ఎంపికచేస్తామని తెలిపారు. ఇందుకోసం ఆరుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని నియమించినట్టు చెప్పారు. గడిచిన 50 ఏండ్లుగా ఈ అవార్డులు ఇస్తున్నట్లు, ఈసారి మాత్రం పూర్తిగా డిజిటలైజేషన్ పద్ధతిన స్వీకరిస్తున్నట్టు చెప్పారు. వీటికి మే 10వ తేదీ చివరి గడువని, ఎంపికైన సంస్థలు, పారిశ్రామికవేత్తలకు జూన్ నెలలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు సింఘాల్ వివరించారు. గడిచిన సంవత్సరంలో 200కి పైగా దరఖాస్తులు రాగా, ఈసారి మరింత పెరి 300 దాటే అవకాశం ఉన్నదన్నారు.

తిరుమలలో తెలంగాణ యువకుడి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): తిరుమలలో తెలంగాణ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన ముని సాత్విక్ (25) తన బంధువు నరేశ్‌తో కలిసి తిరుపతికి వెళ్లాడు. సోమవారం వేకువజామున తన సోదరి స్వర్ణరేఖకు ఫోన్ చేసి తిరుమలలోని కళ్యాణి సత్రం మూడంతస్తుల పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు తెలిపాడు. సోదరి వెంటనే గూగుల్‌లో తిరుమల పోలీసుల నంబర్ సెర్చ్ చేసి వారికి విషయాన్ని తెలిపింది. అప్రమత్తమైన పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి చూడగా యువకుడు భవనం పై నుంచి దూకేందుకు సిద్ధంగా ఉన్నట్టు గమనించి కాపాడారు. సదరు యువకుడికి మానసిక పరిస్థితి బాగా లేదని పోలీసులు గుర్తించారు.

హనుమారెడ్డి(ఫైల్)

యశోద(ఫైల్)

నీ వెంటే నేనూ..!

- భార్య మరణించిన గంటలోనే భర్త మృతి
- రామచంద్రాపురంలో ఘటన

కూసుమంచి(నేలకొండపల్లి), ఏప్రిల్ 14 : ఒకరికొకరు తోడూనీడగా ఉంటున్న ఆ వృద్ధ దంపతులు విధి వక్రీకరించి గంటల వ్యవధిలోనే ఒకరి తర్వాత ఒకరు మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రామచంద్రపురంలో సోమవారం చోటుచేసుకున్నది. బాదిటి హనుమారెడ్డి(81), యశోద (76) దంపతులు రామచంద్రాపురంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం ఇంట్లో పని చేసుకుంటుండగా యశోద కింద పడగా తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించింది. భార్య మరణ వార్త విన్న హనుమారెడ్డి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే దవాఖానకు తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'కంచ' రైతు వెత.. కంచికి చేరని కథ!

మొదటిపేజీ తరువాయి...

సిద్ధమవుతున్న దరిమిలా రెండు దశాబ్దాలుగా న్యాయ పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేయాలని దాదాపు 186 బీసీ రైతు కుటుంబాలు వేడుకుంటున్నాయి. ఇటీవల 'నమస్తే తెలంగాణ'ను ఆశ్రయించిన రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయం కోసం మొదలైన భూసేకరణ ప్రక్రియతో ఈ భూములు తమవి కాకుండా పోయాయని, అప్పటివరకు దశాబ్దాలుగా తమకు ఆధారమైన భూములకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని చెప్పారు. గత ఏడాది ఐఎంజీ భారత కేసు వీగిపోయినందున ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు దశాబ్దాలుగా 'కంచ మామిడిపల్లి' రైతుల కన్నీటివ్యథ ఎందుకు కంచికి చేరడంలేదనే దానిపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని సర్వే నంబరు 99/1లో 2,131.38 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూములు సర్ఖ-ఏ-ఖాస్ అథారిటీకి చెందినవి. అంటే నిజాంకు ఆదాయాన్ని తెచ్చే ప్రైవేటు ఆస్తులు. అందుకే రెవెన్యూ రికార్డుల్లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరిట నమోదై ఉన్నాయి. 1956లో అటవీ శాఖ ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా (నోటిఫికేషన్ నంబర్-1348, 1105/ఏ3/55-56, తేదీ: 28.2.1956) ఈ భూములతోపాటు మరికొంత కంచ భూములను సేకరించింది. పశువులకు మేతకుగాను ఈ భూములను కేటాయించాలని అప్పట్లో నిర్ణయించిన దరిమిలా వీటికి కంచ భూములుగా పేరు వచ్చింది. 1965లో పశు సంరక్షణలో భాగంగా అప్పటి ప్రభుత్వం జీవో-1489 ద్వారా ఈ భూములను పశు సంవర్ధక శాఖకు బదలాయించింది. మామిడిపల్లితోపాటు పరిసర ప్రాంతాల్లో గొర్రెలు, మేకల ద్వారా జీవనోపాధి పొందే యాదవులు, బోయ సామాజిక వర్గం వారే అత్యధికంగా ఉన్నారు. దీంతో 1966లో పశు సంవర్ధక శాఖ 600 ఎకరాల విస్తీర్ణంలో గొర్రెల మేత కోసం చర్యలు చేపట్టింది. మిగిలిన భూమిని గ్రామ ప్రజలు వ్యవసాయానికి అనుగుణంగా మార్చుకొని సాగు చేయడం మొదలుపెట్టారు. రెవెన్యూ పహాణీల్లో కూడా కబ్జాదారుల కాలంలో చాలామంది రైతుల పేర్లు వచ్చాయి. ఇలా 2001 వరకు రైతులు ఆ భూముల్లో సాగు చేసుకోవడం, గుట్టలు ఉన్న చోట సీతాఫలాలు ఏరి వాటిని విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందుతూ వచ్చారు.

2001 తర్వాత చెట్టుకొకరు.. పుట్టకొకరు..

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 2000 సంవత్సరంలో భూసేకరణ ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగా 2001లో మామిడిపల్లిలోని సర్వే నంబరు 99/1లో ఉన్న భూమిని కూడా సేకరించారు. ఇందులో 1,051.34 ఎకరాలను కేటాయించారు. కానీ, ఇందులో 970.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 583 మంది రైతులకు ఎకరాకు రూ.65 వేల చొప్పున రూ.6.32 కోట్ల పరిహారం చెల్లించారు. ఆ తర్వాత అప్పటి ఏపీఐఐసీ మరో 981.32 ఎకరాలను సేకరించి, కేవలం 205.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 136 మందికి మాత్రమే రూ.1.02 కోట్ల నష్ట పరిహారాన్ని పంపిణీ చేసింది. ఇలా 2,032.24 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు, ఏపీఐఐసీ సేకరించినప్పటికీ, కబ్జాలో ఉన్న రైతులందరికీ నష్ట పరిహారాన్ని సక్రమంగా అందించలేదు. దీంతో చాలామంది రైతులు అటు భూమిని కోల్పోయి, ఇటు నష్టపరిహారం అందక చెట్టుకొకరు.. పుట్టకొకరుగా చెల్లాచెదురయ్యారు. అప్పటి నుంచి ఒకవైపు న్యాయ పోరాటం చేస్తూనే మరోవైపు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు పలుమార్లు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఎంతమంది రైతులు ఉన్నారు? గతంలో ఎంతమందికి నష్టపరిహారం అందింది? ఇంకా ఎంతమందికి అందాలనే దానిపై పలు నివేదికలు ఇచ్చారు. ముఖ్యంగా అప్పటి టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు విమానాశ్రయానికి పోను మిగిలిన భూమిని ఏపీఐఐసీ ద్వారా ప్రైవేటు కంపెనీలకు పప్పు బెల్లంలా పంచడంతో భూములు వారి ఆధీనంలోకి పోయాయి. దీంతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినప్పుడు గతంలో కబ్జాలో ఉన్న రైతుల వివరాలను కచ్చితంగా సేకరించడం కష్టసాధ్యంగా మారింది.

రైతులకు పరిహారమివ్వండి

మామిడిపల్లి రైతులు.. ప్రజాప్రతినిధుల, అధికారుల చుట్టూ తిరగడంతో ఎట్టకేలకు ప్రభుత్వం 2013లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన చేసిన కమిటీ 2013 మార్చి 25న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఇందులో 99/1 సర్వే నంబరులోని భూముల వివరాలు, వాటి నేపథ్యాన్ని పొందుపరిచింది. ఈ క్రమంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులో 488 ఎకరాలను ఇందూ టెక్, బ్రాహ్మణి ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలకు ఇవ్వడంతో గతంలో అక్కడ కబ్జాలో ఉన్న రైతుల వివరాలను గుర్తించడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నది. అదేవిధంగా మిగిలిన కొంతభూమిలో గుట్టలు, ఏనెలు ఉన్నందున కబ్జాదారుల గుర్తింపు కష్టతరంగా మారిందని తెలిపింది. అందుకే రెవెన్యూ అధికారులు గత రికార్డులను పరిశీలించి కబ్జాలో ఉన్న రైతుల జాబితాను రూపొందించి, వారికి నష్టపరిహారం ఇవ్వాలని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ఇందుకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు తర్జనభర్జనల తర్వాత 444.10 ఎకరాల విస్తీర్ణంలో 189 మంది రైతులు కబ్జాలో ఉండేవారని తేల్చారు. కానీ, ఇప్పటివరకు వారికి తగిన న్యాయం జరగలేదు. అయితే విమానాశ్రయం, ఏపీఐఐసీ ఈ భూములను సేకరించిన సమయంలో భూమిని కోల్పోయిన రైతులకు పరిహారంతోపాటు ఇంటిలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. అంతేగాకుండా గుట్టలు, ఏనెలు ఉన్న ప్రాంతాన్ని తాము సేకరించబోమని, దానిని రైతులే మూగజీవాలను మేపేందుకు వినియోగించుకోవచ్చని కూడా భరోసా కల్పించారని, కానీ, ఇప్పుడు పెద్ద పెద్ద గుట్టలను కూడా తొలిచి కంపెనీలకు ఇచ్చారని వాపోతున్నారు.

పేరుకే అభివృద్ధి.. లక్ష్యం తమ వారికి లబ్ధి

హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపామనే సమైక్య పాలకుల గొప్పలు మేడిపండు చందమే! గతంలో సమైక్య పాలకులు చేపట్టిన ప్రతి అభివృద్ధి పని వెనుక తమ వారి లబ్ధి దాగి ఉన్నదనేందుకు మామిడిపల్లి భూములే ప్రత్యక్ష నిదర్శనం. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చంద్రబాబు హయాంలో ప్రతిపాదనలు తయారయ్యాయి. పైకి ఇది హైదరాబాద్ అభివృద్ధి జపం. కానీ, సరిగ్గా విమానాశ్రయం ప్రహరీగోడను ఆనుకొని ఉన్న మామిడిపల్లి సర్వే నంబరు 99/1తోపాటు మహేశ్వరం మండలం రావిర్యాల సర్వే నంబరు 1/1లోని 86.32 ఎకరాలను కలుపుకొని మొత్తం 450 ఎకరాలను చంద్రబాబు ప్రభుత్వం ఐఎంజీ అకాడమీస్ భారత పేరిట బిల్లీరావుకు కట్టబెట్టింది. ప్రభుత్వం సేకరించిన భూములకుగాను రైతులకు ఎకరా రూ.65 వేలు చెల్లిస్తే... చంద్రబాబు మాత్రం బిల్లీరావుకు ఎకరా కేవలం రూ.25 వేలకే అంటే మొత్తం 450 ఎకరాలను రూ.1.12 కోట్లకే ధారాదత్తం చేశారు. అయితే, 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చంద్రబాబు చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసింది. అనంతరం మామిడిపల్లిలోని 99/1 సర్వే నంబరులో ఏకంగా 448 ఎకరాలను ఇందూటెక్, బ్రాహ్మణి ఇన్ఫోటెక్‌కు కట్టబెట్టింది. ఐటీ, ఐటీఈఎస్ రంగాల అభివృద్ధి కోసమంటూ ఈ కేటాయింపులు చేశారేగానీ ఇప్పటిదాకా ఆ మేరకు భూముల వినియోగం జరగలేదు. పైగా ఇందులో 250 ఎకరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసుకున్నట్టు తెలిసింది.

న్యాయంగా పరిహారమివ్వండి

విమానాశ్రయం, ఏపీఐఐసీ సేకరించిన భూములకుగాను పరిహారం చాలామందికి ఇచ్చారు. కానీ, అందులో కొంతమంది తమకు పరిహారం ఎక్కువ ఇవ్వాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. వీరికి తోడు అసలు పరిహారమే అందని 186 మంది రైతులు కూడా కోర్టుకు వెళ్లారు. పక్కనే ఉన్న నాదర్‌గుల్‌లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హార్డ్‌వేర్ పార్కు కోసం ఏపీఐఐసీ భూములు సేకరించినప్పుడు ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలు పరిహారం ఇచ్చిందని, అదేరీతిన తమకు న్యాయం చేయాలని మామిడిపల్లి రైతులు డిమాండు చేస్తున్నారు. అయితే, ఐఎంజీ భారతకు చెందిన 450 ఎకరాల కేసు ఇటీవల వరకు కోర్టులోనే పెండింగులో ఉన్నది. గత ఏడాది మార్చిలో కంచ గచ్చిబౌలితోపాటు మామిడిపల్లి భూములు కూడా ప్రభుత్వానివేనంటూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. అందులో పెద్ద ఎత్తున ప్రైవేటు వ్యక